సాక్షి
యాదాద్రి భువనగిరి

శనివారం । 25 । ఫిబ్రవరి । 2023



డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే..
డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. - 9లో



25 నుంచి సైన్స్‌డే ఉత్సవాలు
ఎంజీయూలో 25 నుంచి జాతీయ సైన్స్ డే ఉత్సవాలు నిర్వహించనున్నట్లు వీసీ గోపాల్‌రెడ్డి తెలిపారు. - 10లో

గరిష్ఠం/కనిష్ఠం
36°/17°
వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

భూదాన్‌పోచంపల్లి : స్వయం ఉపాధి కోర్సుల్లో నిరుద్యోగ యువతకు భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పురంలో గల స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్‌ఎస్‌ఆర్ లక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అకౌంట్స్ అసిస్టెంట్(ట్యాలీ), ఆటోమొబైల్ టు, త్రీ వీలర్ సర్వీసింగ్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ట్యాలీ కోర్సుకు బీకాం, ఆటోమొబైల్ పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అభ్యర్థులు 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సున్న వారు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత కల్గిన అభ్యర్థులు తమ విద్యార్హతల ఒర్జినల్, జిరాక్స్‌లు, పాస్‌ఫొటోలు, ఆధార్‌కార్డుతో మార్చి 1న సంస్థలో నిర్వహించే కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని కోరారు. ఎంపికైన అభ్యర్థులకు హాస్టల్ వసతి కల్పించనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తయిన అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు వివరించారు. వివరాలకు 9133908000, 933908111, 9133908222 నంబర్లను సంప్రదించాలని అన్నారు.

శాస్త్రోక్తంగా ఊంజలి సేవ

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం ఊంజలి సేవ ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయ మాఢ, తిరువీధుల్లో ఊరేగించారు. అనంతరం అద్దాల మండపంలో అధిష్టింపజేసి అమ్మవారికి ఊంజలి సేవ చేశారు. అదే విధంగా స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 28 మంది గైర్హాజరు

భువనగిరి : జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం జరిగిన పరీక్షలకు 606 మంది విద్యార్థులకు 578 మంది హాజరయ్యారు. 28 మంది గైర్హాజరైనట్లు డీఐఈఓ రమణి తెలిపారు.

నేడు ఆలేరుకు బండి సంజయ్ రాక



స్థల పరిశీలన చేస్తున్న బీజేపీ నాయకులు

ఆలేరురూరల్ : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ శనివారం ఆలేరుకు రానున్నారు. ఆలేరులో జరిగే ప్రజాగోస – బీజేపీ భరోసా కార్నర్ సమావేశంలో పాల్గొని మాట్లాడుతారని ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ నందకుమార్ యాదవ్ తెలిపారు. శుక్రవారం పార్టీ రాష్ట్ర నాయకులు సూదగానికి హరిశంకర్‌గౌడ్, పడాల శ్రీనివాస్, వట్టిపల్లి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌తో కలిసి స్థల పరిశీలన చేశారు. పార్టీ కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ చిరిగె శ్రీనివాస్, పట్టణ మండల అధ్యక్షులు జహంగీర్, రాఘవేంద్ర, కౌన్సిలర్ సంగు భూపతి, సముద్రాల కల్పన, కృష్ణ, బందెల సుభాష్, రాజు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



వెల్లంకిలో రైతు వేదికను పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ శాఖ డిప్యూటీ కమిషనర్

రామన్నపేట : పంచాయతీరాజ్ శాఖ జాయింట్ కమిషనర్ నర్సింహులు శుక్రవారం రామన్నపేట మండలంలోని వెల్లంకిలో పర్యటించారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు, పారిశుద్ధ్య చర్యలను పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం, కూరెళ్ల గ్రంథాలయం, అంగన్‌వాడీ కేంద్రం, రైతు వేదికలను తనిఖీ చేశారు. వెల్లంకి జాతీయ పురస్కారానికి పోటీపడుతున్న నేపథ్యంలో గ్రామంలో పర్యటించినట్లు డిప్యూటీ కమిషనర్ తెలిపారు. పురస్కారం కోసం తొమ్మిది అంశాలపై పంపిన నివేదికను పరిశీలించారు. పాలక వర్గానికి సూచనలు చేశారు. మార్చి రెండో వారంలో కేంద్ర బృందం పర్యటించనుందని, పంపిన నివేదికలు పక్కాగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డీపీఓ సునంద, డీఎల్‌పీఓ సాధన, ఎంపీడీఓ గాదె జలేందర్‌రెడ్డి, సర్పంచ్ ఎడ్ల మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీ ఎర్రోళ్ల లక్ష్మమ్మ, ఉపసర్పంచ్ రవ్వ అనసూయ పాల్గొన్నారు.

రాజాపేట : మండలంలోని జాల గ్రామాన్ని జాయింట్ కమిషనర్ సందర్శించారు. పరిసరాలు, పంచాయతీ రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట డీపీఓ సునంద, డీఎల్‌పీఓ యాదగిరి, ఎంపీడీఓ జ్ఞానప్రకాష్, ఎంపీ దినకర్, కార్యదర్శి ఉమేష్, సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

● వటపత్రశాయిగా నారసింహుడు



యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన వటపత్రశాయి అలంకార సేవ ఊరేగింపులో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, చిత్రంలో కలెక్టర్ పమేలా సత్పతి, ఈఓ గీతారెడ్డి తదితరులు



హంస వాహన సేవపై ఆశీనులైన నరసింహుడు

అమ్మినవే.. మళ్లీ అమ్మకం!

వెంచర్లలో కొనుగోలుదారుల ప్లాట్లు కనుమరుగు



- ధరణిలో భూ యజమాని పేరు మారకపోవడంతో సమస్యలు
- ఇదే అదనుగా డబుల్ రిజిస్ట్రేషన్లు
- రెవెన్యూ అధికారులు, పోలీసులను ఆశ్రయిస్తున్న బాధితులు
- ఎక్కువగా స్థానికేతరులే..

హైదరాబాద్‌కు చెందిన రియల్టర్ 2012లో యాదగిరిగుట్ట మండలం వంగపల్లి శివారులో ఆరు ఎకరాల భూమి కొనుగోలు చేశాడు. అందులో ప్లాట్లు చేసి విక్రయించాడు. అట్టి భూమిని నాలా కన్వర్షన్‌లోకి మార్చకపోవడంతో ధరణిలో రైతు పేరున చూపుతుంది. ఇదే అదనుగా రైతు కొన్ని పాట్లు చెరిపి చదును చేశాడు. కొనుగోలుదారులు 20మంది ఇటీవల వచ్చి చూడగా విషయం తెలిసింది. దీంతో బాధితులు రెవెన్యూ అధికారులను, పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేశారు. బాధితులు కోర్టుకు వెళ్లినట్లు తెలుస్తోంది.



తుర్కపల్లిలో వెంచర్ చేసిన వ్యవసాయ భూమిలో కొంత భాగం ధరణిలో రైతు పేరున చూపుతోంది. ఆ భూమిని రెవెన్యూ అధికారులు మరో వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేశారు. అనంతరం ప్లాట్ల హద్దు రాళ్లు కూడా తొలగించారు. విషయం తెలిసిన ప్లాట్ల యజమానులు రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేశారు.

హైదరాబాద్‌కు చెందిన రియల్టర్ ఆలేరు శివారులో 2009లో రైతుల వద్ద భూమి కొనుగోలు చేశాడు. అందులో ప్లాట్లు చేసి 100 మందికి పైగానే విక్రయించాడు. వారంతా స్థానికేతరులు. అయితే ఈ భూమి ధరణి వెబ్‌సైట్‌లో ఇంకా రైతు పేరు మీదనే వస్తుండడంతో దాన్ని సాగు చేశాడు. ఎవరు వచ్చి అభ్యంతరం చెప్పకపోవడంతో మరో రియల్టర్‌కు విక్రయించాడు. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ఇటీవల వచ్చి తన ప్లాట్ కోసం ఎంత వెతికినా కనిపించకపోవడంతోఅధికారులను ఆశ్రయించాడు.

సాక్షి, యాదాద్రి : వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి తిప్పలు తప్పడం లేదు. ధరణిలో భూ యజమాని పేరు మారకపోవడంతో ఇదే అదనుగా అమ్మిన ప్లాట్లనే మరొకరికి విక్రయిస్తున్నారు. దీంతో బాధితులు న్యాయం కోసం రెవెన్యూ అధికారులు, పోలీసులను ఆశ్రయిస్తున్నారు.

పెద్ద ఎత్తున లే అవుట్‌లు

యాదాద్రి పుణ్యక్షేత్రం, ఎయిమ్స్, ఇండస్ట్రియల్ పార్కులతో పాటు హైదరాబాద్‌కు సమీపంలో ఉండడంతో యాదాద్రి భువనగిరి జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతోంది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు పెద్ద ఎత్తున సాగు భూములు కొనుగోలు చేసి వెంచర్లు ఏర్పాటు చేశారు. కానీ, ఎలాంటి సాంకేతిక అనుమతులు పొందకుండా నిబంధనలకు విరుద్ధంగా లే అవుట్‌లు చేశారు. వినియోగదారులను ఆకర్షించేలా బ్రోచర్లు ముద్రించి లక్షలాది ప్లాట్లను కాగితాలపైనే విక్రయించారు. వ్యవసాయ భూమిని వెంచర్ చేయాలంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం తొలుత నాలా కన్వర్షన్‌లోకి (వ్యవసాయ భూములను వాణిజ్య భూములుగా) మార్చుకోవాల్సి ఉంటుంది. కానీ, రియల్ ఎస్టేట్ వ్యాపారులు అవేమీ పట్టించుకోవడం లేదు. దీంతో ధరణిలో భూ యజమాని పేరు మారలేదు. ఇదే అదనుగా రియల్టర్లు అక్రమాలకు పాల్పడుతున్నారు. అమ్మిన ప్లాట్లను ఇతరులకు విక్రయిస్తున్నారు. జిల్లాలో గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా వెలిసిన వెంచర్లు 1,200 వరకు ఉన్నట్లు తెలుస్తోంది. ఆయా వెంచర్లలో జిల్లా వాసులతో పాటు హైదరాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన వారు భవిష్యత్ అవసరాల దృష్ట్యా ప్లాట్లు కొనుగోలు చేశారు. తాము కొనుగోలు చేసిన ప్లాట్లు ధరణి పోర్టల్‌లో భూ యజమాని పేరున వస్తుండడంతో ఇబ్బందుల్లో పడుతున్నారు. అంతేకాకుండా వినియోగదారులు కొనుగోలు చేసిన ప్లాట్లకు రైతుల ఖాతాల్లో రైతుబంధు డబ్బులు కూడా జమ అవుతున్నాయి. భూమి హక్కులు తమకే వచ్చాయని తిరిగి అమ్మేస్తున్నారు.

రిజిస్ట్రేషన్లు నిలిపివేస్తున్నాం



డబుల్ రిజిస్ట్రేషన్లు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. భువనగిరిలోని లక్ష్మీనర్సింహ వెంచర్‌లో అలాంటి పరిస్థితి వస్తే రిజిస్ట్రేషన్లు నిలిపివేశాం. ప్లాట్‌లు కనిపించని వారు సరైన పత్రాలు తీసుకుని తహసీల్దార్ కార్యాలయంలో సమర్పిస్తే అటువంటి భూములను ఈసీ చూసి పాస్ బుక్ ఇవ్వకుండా నిలిపే అధికారం ఉంది. ప్రజలు వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసేటప్పుడు అన్ని సరిచూసుకోవాలి.

–వెంకట్‌రెడ్డి, తహసీల్దార్, భువనగిరి మండలం

అధికారుల అండతో!

ధరణిలో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల బాధ్యతను ప్రభుత్వం రెవెన్యూ అధికారులకు అప్పగించిన విషయం తెలిసిందే. కొందరు అధికారులు ధరణిలో ఉన్న సాంకేతిక కారణాలను ఆసరాగా చేసుకొని డబుల్ రిజిస్ట్రేషన్లకు పాల్పడుతున్నారు. చాలా ఏళ్ల క్రితం ప్లాట్లు కొనుగోలు చేసిన వారు వచ్చి చూడగా కనిపించడం లేదు.

విద్యుత్ సిబ్బందిపై దాడి.. పలువురికి గాయాలు

వలిగొండ : విద్యుత్ సిబ్బందిపై కొందరు వ్యక్తులు దాడి చేసిన ఘటన శుక్రవారం రాత్రి వలిగొండలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండకు చెందిన బల్లెపు కృష్ణస్వామి తన ఇంటి కరెంట్ బిల్లు బకాయి పడ్డాడు. దీంతో విద్యుత్ సిబ్బంది కరెంట్ సరఫరా నిలిపివేశారు. ఆగ్రహించిన కృష్ణస్వామి కళ్లెం నరేష్, వేముల నర్సింహ, గుర్తుతెలియని వ్యక్తితో కలిసి విద్యుత్ కార్యాలయానికి వెళ్లి నల్ల రాములుపై ఇనుప రాడ్డుతో దాడి చేశారు.అడ్డుకోబోయిన ముగ్గురు విద్యుత్ పైనా దాడికి దిగారు. కార్యాలయం తలుపులను ధ్వసం చేశారు. గాయపడ్డ వారిని రామన్నపేట ఆస్పత్రికి తరలించారు. ఏఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేడు భువనగిరి మున్సిపల్ సమస్యలపై 'సాక్షి ఫోన్‌ఇన్'

ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు

భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో కుక్కలు, కోతుల బెడదతో ఇబ్బందులు పడుతున్నారా.. మంచినీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాల సమస్యలు ఎదుర్కొంటున్నారా.. అయితే మీ సమస్యలను నేరుగా మున్సిపల్ కమిషనర్‌కు తెలియజేయండి. మున్సిపల్ కమిషనర్‌తో 'సాక్షి' శనివారం ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది.

సాక్షి ఫోన్‌ఇన్

ఫోన్ చేయాల్సిన నంబర్ : 98499 05913



నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, భువనగిరి

అట్టడుగు వర్గాలు పాలకులవ్వాలి

- డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్

రామన్నపేట : జనాభాలో 90 శాతం ఉన్న అట్టడుగు వర్గాలు పాలకులుగా మారినప్పుడే పేదలకు ఉచిత విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు లభిస్తాయని దళితశక్తి ప్రోగ్రాం రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ అన్నారు. రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యాధికారమే లక్ష్యంగా విశారదన్ మహారాజ్ చేపట్టిన పాదయాత్ర శుక్రవారం రామన్నపేట మండలంలో కొనసాగింది. వెల్లంకి, సిరిపురం, బోగారం గ్రామాల్లో ఆయన మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ, ఎస్టీలు పథకాలు తీసుకునే ముడిసరుకులుగా ఉండటం ఏమిటని ప్రశ్నించారు. అట్టడుగు వర్గాల ప్రజలకు డీఎస్పీ శాశ్వత పరిష్కారం చూపబోతుందన్నారు.



వెల్లంకిలో పాదయాత్ర చేస్తున్న విశారదన్ మహారాజ్

యాత్ర 29 జిల్లాల్లో 7,892 కిలో మీటర్లు పూర్తయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాదయాత్ర ఇంచార్జ్ లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు నరేందర్, మండల అధ్యక్షుడు నరసింహ, మల్లేష్, నరేందర్, గోవర్ధన్, అశోక్ పాల్గొన్నారు.

బాలల సంరక్షణ అందరి బాధ్యత



చిన్నారులతో కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, డీసీపీ రాజేశ్‌చంద్ర తదితరులు

- కలెక్టర్ పమేలా సత్పతి

బీబీనగర్ : బాలల సంరక్షణ, వారి హక్కులను కాపాడడం ప్రతి ఒక్కరూ బాధ్యతంగా భావించాలని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. భువనగిరిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన స్నేహిత రెండవ విడత అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బాలల హక్కులు కాపాడడం, వారి సంరక్షణ, బాధ్యతల పట్ల తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించేందుకు స్నేహిత కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. తొలి విడతలో ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో 26 బృందాలను ఏర్పాటు చేసి 271 పాఠశాలల్లో 6నుంచి 10వ తరగతుల విద్యార్థులు 43వేల మందికి, తల్లిదండ్రులకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. రెండో విడుతలో 42 బృందాల ద్వారా 251 పాఠశాలల్లో 17,058మంది విద్యార్థులకు స్పర్శ, చెడు స్పర్శ, విద్య ప్రాముఖ్యం, ఇంటర్‌నెట్ దుర్వినియోగం, ఆరోగ్య అలవాట్లు, స్వీయ రక్షణ తదితర అంశాలపై అవగహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. డీసీపీ రాజేశ్‌చంద్ర మాట్లాడుతూ.. ఎమైనా సమస్యలు వస్తే 1098, 100 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, ఎంపీపీ సుధాకర్‌గౌడ్, జెడ్పీటీసీ ప్రణీతాపింగళ్‌రెడ్డి, తహసీల్దార్ అశోక్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి అన్నపూర్ణ, ఏంపీడీఓ శ్రీవాణి, సర్పంచ్ భాగ్యలక్ష్మీశ్రీనివాస్, ఏంఈఓ నాగవర్దన్ రెడ్డి, జిల్లా బాలల సంరక్షణ అధికారి సైదులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

1,00,980 మందికి కంటి పరీక్షలు

సాక్షి, యాదాద్రి : కంటి వెలుగు రెండో విడతలో ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 1,00,980 మందికి పరీక్షలు నిర్వహించినట్లు కలెక్టర్ పమేలా సత్పతి వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కంటి వెలుగు, హరితహారం, అయిల్‌పామ్ సాగు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 110 గ్రామ పంచాయతీలు, 40 వార్డుల్లో కంటి వెలుగు పరీక్షలు పూర్తయినట్లు చెప్పారు. 19,198 రీడింగ్ అద్దాలు, 1,421 ప్రిస్కిప్షన్ అద్దాలు పంపణీ చేసినట్లు వెల్లడించారు. 13,547 ప్రిస్కిప్షన్ అద్దాలు ఆర్డర్ పెట్టినట్లు చెప్పారు. 918 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగులోకి వచ్చిందని, మార్చి నెలాఖరు నాటికి వెయ్యి ఎకరాలకు చేరుతుందన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, శ్రీనివాస్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ మల్లికార్జున్‌రావు, జిల్లా అటవీ అధికారి పద్మజారాణి, ఉద్యానవన శాఖ అధికారి అన్నపూర్ణ, మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రగతికి ప్రోత్సాహం

- జాతీయ పురస్కారాల ఎంపికకు కసరత్తు
- జిల్లాలో 27 పంచాయతీలు పోటీ
- 9 కేటగిరీల్లో మూడింటిని ఎంపిక చేయనున్న అధికారులు
- వచ్చేవారం పరిశీలనకు రానున్న కేంద్ర, రాష్ట్ర బృందాలు



వెల్లంకిలో సర్పంచ్ మహేందర్‌రెడ్డి సొంత నిధులతో నిర్మించిన మోడల్ గ్రామ పంచాయతీ భవనం

రామన్నపేట : దేశానికి పట్టుగొమ్మలు పల్లెసీమలు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం పురోగతి సాధిస్తుంది. అందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీలకు నిధులు మంజూరు చేస్తున్నాయి. ఆయా నిధులను సద్వినియోగం చేసుకుంటూ పల్లెల్లో అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నారు. తద్వారా మారుమూల గ్రామాల్లో సైతం సమూల మార్పులు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో గ్రామ పంచాయతీలను మరింత ప్రోత్సహించేందుకు జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఏప్రిల్ 24న కేంద్రం జాతీయ పురస్కారాలు ఇవ్వనుంది. ఇందుకు సంబంధించి 2021 – 22 సంవత్సరానికి గాను ఉత్తమ గ్రామ పంచాయతీల ఎంపికకు అధికారులు జాబితా సిద్ధం చేస్తున్నారు. జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండలస్థాయిలో ఉత్తమ పంచాయతీల ఎంపిక ఉంటుంది.

తొమ్మిది కేటగిరీల్లో..

ప్రతి గ్రామ పంచాయతీ తొమ్మిది కేటగిరీల్లో సాధించిన ప్రగతి, ఆయా కేటగిరీల గణాంకాలను కొలమానంగా తీసుకొని పురస్కారాలు ఇస్తుంది. ఇందుకు సంబంధించిన వివరాలను పంచాయతీ కార్యదర్శులు ఇప్పటికే నేషనల్ పంచాయతీ అవార్డ్స్ వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. ఇట్టి సమాచారాన్ని మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో మదింపు చేసిన తర్వాత జాతీయ స్థాయికి సిఫారసు చేస్తారు.

27 పంచాయతీల మధ్య పోటీ

జిల్లాలో 421 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఒక్కో కేటగిరీ నుంచి మూడు పంచాయతీల చొప్పున 27 గ్రామ పంచాయతీలు అవార్డులకు పోటీ పడుతున్నాయి. ఆయా పంచాయతీల్లో రాష్ట్ర స్థాయి అధికారుల బృందాలు పర్యటించి మూడు పంచాయతీలను ఎంపిక చేస్తాయి.

పరిగణనలోకి తీసుకునే అంశాలు

- పేదరికం లేని, మెరుగైన జీవనోపాధి కలిగి ఉండడం
- ఆరోగ్యకరమైన వాతావరణం
- చైల్డ్ ఫ్రెండ్లీ • సమృద్ధిగా నీరు
- క్లీన్ అండ్ గ్రీన్
- స్వీయ సమృద్ధిగల మౌలిక సదుపాయాలు
- సామాజిక భద్రత • గుడ్ గవర్నెన్స్
- మహిళా స్నేహపూర్వక పంచాయతీ

పోటీ పడుతున్న పంచాయతీలు కేటగిరీల వారీగా..

- పేదరికం లేని మెరుగైన జీవనోపాధి పంచాయతీల కేటగిరీ : దండు మల్కాపురం, కొలనుపాక, బీబీనగర్
- ఆరోగ్యకరమైన పంచాయతీ : ఇక్కుర్తి, మంతపురి, వాసాలమర్రి
- చైల్డ్ ప్రెండ్లీ : ఇంద్రపాలనగరం, పహిల్వాన్‌పూర్, మేడితండా
- సరిపడా నీరు : నమాత్‌పల్లి, ఎస్.లింగోటం, గంగాపూర్
- స్వీయ సమృద్ధితో కూడిన మౌలిక సదుపాయాలు : వెల్లంకి, రేణికుంట, సంగెం
- క్లీన్ అండ్ గ్రీన్ : ఎస్.లింగోటం , జలాల్‌పురం, వడాయిగూడెం
- సామాజిక భద్రత : అన్నంపట్ల, దిల్‌వార్‌పూర్, జాల
- గుడ్ గవర్నెన్స్ : తాజ్‌పూర్, సాయినగర్, రామలింగంపల్లి
- మహిళా స్నేహపూర్వక : శివారెడ్డిగూడెం, రాఘవాపూర్, మాదాపూర్ పంచాయతీ.

అందరి సహకారంతో అభివృద్ధి



ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజల సహకారంతో గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాం. 75 శాతానికి పైగా సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాం. పారిశుద్ధ్యం, రక్షిత నీటి సరఫరాకు ప్రాధాన్యం ఇచ్చాం. దాతల సహకారంతో పంచాయతీ భవనం, నీటిశుద్ధి కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రం, విశ్రాంతి భవనం నిర్మించాం. జాతీయ పురస్కారం ఎంపికకు కావాల్సిన అర్హతలన్నీ గ్రామ పంచాయతీకి ఉన్నాయి. అవార్డు వస్తుందన్న నమ్మకం ఉంది.

–ఎడ్ల మహేందర్‌రెడ్డి, సర్పంచ్, వెల్లంకి

శక్తిమేర కృషి చేశాను



నాలుగేళ్లలో గ్రామాభివృద్ధి కోసం నా శక్తి మేరకు కృషి చేశాను. 40 సీసీరోడ్లు, నాలుగు కిలో మీటర్ల మేర డ్రెయినేజీలు నిర్మించాం. వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చిన వెయ్యికి పైగా కుటుంబాల అవసరాలకు తగ్గట్టు మంచినీటి సరఫరా జరుగుతుంది. గ్రామంలో పర్యటించిన జాతీయ, రాష్ట్ర అధికారుల బృందాలు అభివృద్ధిని చూసి సంతృప్తి వ్యక్తం చేశాయి.

–ఆకుల సునీత, సర్పంచ్, ఎస్.లింగోటం

రెండు రకాల అవార్డులు

తొమ్మిది విభాగాల్లో ఒక్కో విభాగంలో మెరుగైన పనితీరు కనబరిచిన మొదటి మూడు గ్రామ పంచాయతీలకు అవార్డులు ఇవ్వనున్నారు. నేషనల్ దేశ్‌ముఖ్ సరోత్తం పంచాయత్ సతత్ వికాస్ పురస్కారం, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పేరిట రెండు రకాల పురస్కారాలు ఉంటాయి.

మొదటి రకం పురస్కారానికి : మొదటి స్థానంలో నిలిచిన పంచాయతీకి రూ.1.50 కోట్లు, ద్వితీయ స్థానం రూ.1.25కోట్లు, తృతీయ స్థానం పంచాయతీకి కోటి రూపాయలు ఇవ్వనున్నారు. జిల్లా యూనిట్ పురస్కారాలకు వరుసగా రూ.5 కోట్లు, రూ.2 కోట్లు, మండల యూనిట్ వరుసగా రూ.1.00 కోటి, రూ.75లక్షలు, రూ.50లక్షలు ఇస్తారు.

రెండవ రకం : జాతీయ స్థాయిలో మొదటి రెండు పంచాయతీలకు రూ.50 లక్షలు, రూ.10 లక్షలు, జిల్లా స్థాయిలో మొదటి మూడు పురస్కారాలకు వరుసగా రూ.1.50 కోట్లు, రూ.1.25 కోట్లు, రూ.1.00 కోట్లు, మండల స్థాయిలో ప్రథమ రూ.50లక్షలు, ద్వితీయ రూ.40లక్షలు, తృతీయ స్థానంలో నిలిచిన పంచాయతీకి రూ.30లక్షలు అందజేయనున్నారు.

క్లుప్తంగా

వెండి మొక్కు జోడు సేవలు రద్దు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో భక్తులు నిర్వహించే వెండి మొక్కు జోడు సేవలను వచ్చే నెల 3వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు ఆలయ ఈఓ గీతారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ వెండి మొక్కు జోడు సేవలను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ఇందుకు భక్తులు సహకరించాలని కోరారు.

పురాతన శివలింగం చోరీ



శివలింగం

మిర్యాలగూడ: దామరచర్ల మండలం బొత్తలపాలెం గ్రామ శివారులో సుమారు 1350 సంవత్సరాల క్రితం నాటి శివలింగం గురువారం రాత్రి అపహరణకు గురైంది. బొత్తలపాలెం గ్రామంలో గల బైరవాని చెరువు కట్టపై కాకతీయ రెడ్డిరాజు నిర్మించిన శివాలయం శిథిలం కాగా.. గ్రామస్తులు శివలింగానికి పూజలు నిర్వహిస్తున్నారు. గురువారం రాత్రి 11 గంటల వరకు కూడా శివలింగం ఉందని, ఉదయం సమయంలో శివలింగం కనిపించలేదని చెరువు కాపలాదారులు తెలిపారు. అర్ధరాత్రి సమయంలో శివాలయం వైపు ఒక ఆటో వెళ్లినట్లు గ్రామస్తులు గుర్తించారు. కాగా.. సంఘటన స్థలాన్ని ఎస్‌ఐ రవికుమార్ సందర్శించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్టు

గరిడేపల్లి : గరిడేపల్లి మండలంలోని రాయినిగూడెం గ్రామంలో చెరువు కట్ట వద్ద పేకాట ఆడుతున్న నలుగురిని శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేశారు. వారి నుంచి నాలుగు బైక్‌లు, రెండు సెల్‌ఫోన్లు, రూ.1500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరితోపాటు పరారైన వ్యక్తులపై కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కొండల్‌రెడ్డి తెలిపారు.

గేదెను ఢీకొన్న బైక్.. ఒకరు మృతి



శ్రీహరిరాజు (ఫైల్)

పెద్దవూర: బైకుపై వెళ్తున్న వ్యక్తి గేదెను ఢీకొన్న ఘటనలో గాయాలపాలై చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. పెద్దవూర ఎస్‌ఐ పచ్చిపాల పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ రామంతపూర్‌కు చెందిన బొల్లెపల్లి శ్రీహరిరాజు (46)తన బైక్‌పై హాలియా నుంచి లింగంపల్లి గ్రామశివారులోగల తమ బత్తాయి తోటకు గురువారం రాత్రి 8.30గంటల సమయంలో వస్తున్నాడు. పెద్దవూర మండల పరిధిలోని లింగంపల్లి గ్రామం వద్ద అకస్మాత్తుగా రోడ్డుపైకి గేదె రావడంతో దానికి ఢీకొట్టాడు. బైక్ పైనుంచి కిందపడిన రాజు తలకు, చేతులకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతడిని హైదరాబాద్‌కు తరలించగా చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి అన్న బొల్లెపల్లి శ్రీనివాసరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

హంసవాహన సేవలో యాదాద్రీశుడు



హంసవాహన సేవలో పాల్గొన్న భక్తులు



వటపత్రశాయి అలంకరణ సేవ విశిష్టతను వివరిస్తున్న ఆచార్యులు

- యాదాద్రి క్షేత్రంలో కొనసాగుతున్న శ్రీస్వామివారి బ్రహ్మోత్సవాలు
- ఉదయం వటపత్రశాయిగా.. సాయంత్రం హంసవాహన సేవలో భక్తులకు దర్శనం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రంలో వార్షిక బ్రహ్మోత్సాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. నాల్గవ రోజైన శుక్రవారం ఉదయం శ్రీస్వామి వారు వటపత్రశాయి అలంకార సేవలో.. సాయంత్రం హంస వాహన సేవలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఆలయంలో వేకువజామునే..

ప్రధానాలయంలో వేకువజామునే నిత్యారాధనలు, నిత్యపూజల అనంతరం ఉదయం 7గంటల నుంచి 9గంటల వరకు పారాయణీకులు వేద పారాయణం పఠించారు. అనంతరం ఉదయం 9.23 గంటలకు శ్రీస్వామి వారిని వటపత్రశాయి అలంకారంలో ప్రత్యేక పల్లకీపై అధిష్టించి ఆలయ తిరుమాఢ వీధుల్లో ఊరేగించారు. అనంతరం పడమటి రాజగోపురం ఎదుట గల వేంచేపు మండపంలో శ్రీస్వామిని ప్రత్యేక బల్లపై అధిష్టించి విశేషంగా ఆరాధించారు. డోలు సన్నాయి మేళాలతో శ్రీస్వామికి మంగళకరమైన వాయిద్యాలతో కీర్తించారు. అలంకార సేవలో గవర్నర్ తమిళిసై సౌందర రాజన్, కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ దీపక్‌తివారీ, ఆలయ ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి, ఆచార్యులు, పారాయణీకులు, రుత్వికులు, ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

సాయంత్రం వేళ..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాయంత్రం ఆలయంలో నిత్యారాధనలు నిర్వహించారు. అనంతరం శ్రీస్వామి వారిని హంస వాహన అలంకార సేవలో అలంకరించి ఊరేగించారు. దక్షిణ దిశలోని ప్రథమ ప్రాకారం నుంచి ప్రారంభమైన అలంకార సేవ పడమటి రాజగోపురం నుంచి ఉత్తరం, తూర్పు, దక్షిణ రాజగోపురాల ముందు నుంచి ముందుకు సాగింది. పడమటి రాజగోపురం ఎదుట గల వేంచేపు మండపంలో శ్రీస్వామి సేవను అధిష్టించి ఆచార్యులు వేద మంత్రాలను పఠించారు.



వటపత్రశాయి అలంకరణలో స్వామివారు

ఆకట్టుకుంటున్న సాంస్కృతిక కార్యక్రమాలు

యాదాద్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా వైటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. శుక్రవారం సాయంత్రం డాక్టర్ అలేఖ్య పుంజాల బృందం సభ్యులు కూచిపూడి ప్రదర్శన, అన్నమాచార్య ప్రాజెక్టు టీటీడీ బృందం వారిచే అన్నమాచార్య సంకీర్తనలు నిర్వహించారు.

ఆలయంలో నేడు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో శనివారం ఉదయం శ్రీస్వామి వారిని శ్రీకృష్ణాలంకరణ (మురళీ కృష్ణుడు) సేవ నిర్వహించనున్నారు. ఇక సాయంత్రం పొన్నవాహన సేవ ఊరేగింపు జరిపిస్తారు.

కొనసాగుతున్న ఉచిత వైద్య శిబిరం

శ్రీస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా క్షేత్రానికి వచ్చే భక్తులకు యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని యాదగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు వంశీకృష్ణ, హరీష్ నేతృత్వంలో ఉచిత వైద్య సేవలు నిర్వహిస్తున్నారు. కొండపైన బస్టాండ్ వద్ద, కొండ కింద కల్యాణ కట్ట సమీపంలో భక్తులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తున్నారు.





సాంస్కృతిక వేదికపై అన్నమాచార్య సంకీర్తనలు ఆలపిస్తున్న టీటీడీ బృందం



యాదాద్రి కొండపైన కూచిపూడి నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారిణులు

కుక్కల దాడిలో 15మందికి గాయాలు

సూర్యాపేట: పట్టణంలోని పలు వార్డుల్లో శునకాలు శుక్రవారం 15మందిపై దాడిచేసి గాయపరిచాయి. పట్టణంలోని రాజీవ్‌నగర్, కొత్తగూడెం బజార్, నెహ్రూనగర్‌లో 15మందిని శునకాలు గాయపరిచాయి. గాయపడ్డ వారిని సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించి టీకాలు వేశారు. ఇటీవల సూర్యాపేట పట్టణంలో కుక్కల బెడద తీవ్రమైందని, వాటిని కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు. కాగా, వివిధ ప్రాంతాల నుంచి సూర్యాపేట ఆస్పత్రికి రోజుకు కనీసం 30 నుంచి 40 కుక్క కాటు కేసులు వస్తున్నాయని డాక్టర్లు చెబుతున్నారు.

ఆత్మకూర్‌లో 6 గొర్రెలు మృతి

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : వీధి కుక్కల దాడిలో ఆరు గొర్రెలు మృతిచెందిన సంఘటన ఆత్మకూర్ మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముత్యాల మల్లయ్య, నగిరె కృష్ణయ్యలు గొర్రెలను మేత కోసం గ్రామ శివారులోకి వేర్వేరుగా తోలుకుని వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో గుంపులుగా వచ్చిన కుక్కలు ఒక్కసారిగా మందపై దాడిచేసి దాదాపు ఆరు గొర్రెలను చంపివేశాయి.



మృతిచెందిన గొర్రెలు

అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య



నాగరాజు (ఫైల్)

భువనగిరి : అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన భువనగిరి మండల పరిధిలోని తుక్కాపురం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఈర్ల నాగరాజు(27) భువనగిరి పట్టణంలోని ఓ పెట్రోల్ బంకులో పనిచేస్తున్నాడు. అప్పుల బాధతో మానసిక వేదనకు గురై శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బిల్డింగ్ కొక్కానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా తన మృతికి ఎవరు కారణం కాదని సూసైడ్ నోటు రాశాడు. మృతుడి సోదరి కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై రాఘవేందర్‌గౌడ్ తెలిపారు.

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సాయి త్రిలోక్

గరిడేపల్లి : తప్పిపోయిన బాలుడిని చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు అతడి తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. గురువారం రాత్రి గరిడేపల్లి మండలంలోని కితవారిగూడెంలో గుర్తుతెలియని బాలుడిని గ్రామ ప్రజలు గుర్తించి చైల్డ్ డిపార్ట్‌మెంట్ వారికి అప్పగించారు. బాలుడిని బాలల సంరక్షణ కేంద్రంలో ఉంచి విచారించగా అతడి పేరు వనమా రాజీవ్‌గా, తల్లిదండ్రులు పద్మావతి, సురేష్ అని చెప్పాడు. ఈమేరకు బాలుడిని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆదేశాల మేరకు చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సాయి త్రిలోక్ ఆధ్వర్యంలో ఖమ్మంలో ఉన్న బాబు తల్లిదండ్రులకు శుక్రవారం అప్పగించారు.

భువనగిరి పట్టణ అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి

భువనగిరి : భువనగిరి పట్టణాన్ని అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని సమ్మద్ చౌరస్తా నుంచి జంఖానగూడెం చౌరస్తా వరకు చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో సీసీ రోడ్లతో పాటు డ్రెయినేజీ పనులు చేపడతామని, మంచి నీటి సమస్యలు లేకుండా చూస్తామని తెలిపారు. ఇప్పటికే పట్టణంలో సీసీ రోడ్లు వేయడం జరిగిందని, ప్రస్తుతం సమ్మద్ చౌరస్తా నుంచి జంఖానగూడెం చౌరస్తా వరకు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ ఆంజనేయులు, వైస్ చైర్మన్ కిష్టయ్య, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ కమిటీ అధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్, కార్యదర్శి రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ హేమలత, నాయకులు జగన్, హరికిషన్ గౌడ్ తదితరులు నాయకులు ఉన్నారు.



అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి

భూమి విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

- పలువురికి గాయాలు

చివ్వెంల(సూర్యాపేట) : ఇంటి స్థలం విషయంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పలువురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన చివ్వెంల మండల పరిధిలోని ఉండ్రుగొండ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో చర్చి పక్కన ఉన్న 221 గజాల స్థల విషయంలో గ్రామానికి చెందిన మాద సుధాకు అదే గ్రామానికి చెందిన శీలం నాగయ్య, శీలం శ్రీను, శీలం వెంకటేశ్వర్లు, శీలం పవన్‌ల మధ్యన ఘర్షణ నెలకొంది. ఈ క్రమంలో ఆ స్థలంలో బావి ఉండడంతో దానిని పూడ్చివేసి ఇంటి నిర్మాణం కోసం సుధా గ్రామ పంచాయతీ అనుమతులు తీసుకుంది. కాగా గ్రామానికి చెందిన శ్రీను, నాగయ్య, వెంకటేశ్వర్లు, పవన్‌లు అదే స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టారు. దీంతో శుక్రవారం స్థల విషయంలో సుధా, ఆమె సోదరుడు దార పుల్లయ్య, ఆయన కుమారుడు ప్రసన్న కుమార్, కూతుర్లు నవ్య, రాజేశ్వరీలకు నాగయ్య, శ్రీను, వెంకటేశ్వర్లు, పవన్‌లతో ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణతో ఇరువర్గాల వారికి గాయాలయ్యాయి. వీరిని స్థానికులు చికిత్స నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్‌ఐ విష్ణుమూర్తిని వివరణ కోరగా ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.



గాయపడిన సుధా కుటుంబ సభ్యులు

పోరాటాల ద్వారా సమస్యల పరిష్కారం

- సీపీఎం నేత జూలకంటి రంగారెడ్డి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయడం ద్వారానే ప్రభుత్వాల మెడలు వంచి సమస్యలు పరిష్కారం చేసుకోగలుగుతామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజాధనాన్ని కొల్లగొడుతూ పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తుందన్నారు. దేశంలోని 10 శాతం మంది చేతుల్లో 100శాతం సంపద దాగి ఉందన్నారు. నరేంద్రమోదీ పాలనలో పేద, మధ్య తరగతి ప్రజలపై భారాలు మోపుతూ.. పెద్దలకు రాయితీలు కల్పించడం దుర్మార్గమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీని అడుగుపెట్టనివ్వకుండా అడ్డుకుంటమన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, బుర్రి శ్రీరాములు, రవి నాయక్, మేదరమెట్ల వెంకటేశ్వర రావు, కోట గోపి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి

తెలంగాణలో బహుజన రాజ్యస్థాపనే లక్ష్యం

కోదాడ: తెలంగాణ రాష్ట్రంలో బహుజన రాజ్యం స్థాపనే లక్ష్యంగా ముందుకు పోతున్నామని బీఎస్పీ ఉత్తరప్రదేశ్ ఎంపీ రాంజీగౌతమ్ అన్నారు. శుక్రవారం కోదాడలో జరిగిన ఆ పార్టీ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్, దేశంలో బీజేపీ రెండు ఒకటేనన్నారు. రాష్ట్రంలో బహుజనులు ఏకమై రాజ్యాధికార సాధనకు పోరాడాలన్నారు. రాష్ట్రంలో లక్షకు పైగా బ్యాక్‌లాగ్ పోస్టులు ఉన్నాయని వాటిని వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు మందా ప్రభాకర్, బాలస్వామి, దయానందరావు, పిల్లుట్ల శ్రీనివాస్, బొడ్డు కిరణ్, మల్లేశ్ యాదవ్, కాంపాటి శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు గుర్తించాలి

సాక్షి,యాదాద్రి : రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు కృషి చేయాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థల సహాయ సంచాలకులు డాక్టర్ మల్లారెడ్డి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏరువాక కేంద్రం జిల్లా సమన్వయ సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఆయా ప్రాంతాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి నివారణ చర్యలు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఏఓ నీలిమ, నల్లగొండ ఇన్‌చార్జ్ డీఏఓ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

వరిపంటకు చీడపీడల బెడద

- అధికంగా పురుగు మందులు వాడితే పంటకు నష్టం
- సస్యరక్షణ చర్యలు పాటించాలంటున్న వ్యవసాయాధికారి



ఎండీ జానిమియా

నడిగూడెం : ప్రస్తుత రబీ సీజన్‌లో వరి పంట పెరిగే దశలోనూ, పలు ప్రాంతాల్లో చిరు పొట్ట దశల్లో ఉంది. అయితే వరి పంటకు చీడపీడలు ఆశించి నష్టపరుస్తున్నాయి. ఈ దశలో ఇష్టారాజ్యంగా పురుగు మందులు వాడొద్దని, మోతాదుగా వాడాలని సూర్యాపేట మండల వ్యవసాయాధికారి ఎండీ జానిమియా పేర్కొంటున్నారు. వరిసాగులో సస్యరక్షణ చర్యలపై సలహాలు, సూచనలు ఆయన మాటల్లోనే..

కాండం తొలుచు పురుగు

ఈ పురుగు నారుమడి, పిలకదశ, అంకురం నుంచి చిరు పొట్టదశ వరకు ఆశిస్తుంది. పిలక దశలో మొవ్వ చనిపోతుంది. అంకురం నుంచి చిరుపొట్ట దశలో ఆశిస్తే ఈనిన తర్వాత తెల్ల కంకులు బయటకు వస్తాయి. కంకి పాలు పోసుకోక తాలుపోతుంది. ఈ పురుగులు ఆలస్యంగా నాట్లు పెట్టిన లేదా ముదురు నాట్లు పెట్టిన పొలాల్లో ఆశిస్తాయి. నత్రజని ఎరువులు తక్కువగా వాడడం వల్ల కాండం బలహీనంగా మారినప్పుడు ఆశిస్తుంది.





వరి పైరుకు సోకిన అగ్గితెగులు, పాముపొడ తెగులు

నివారణ చర్యలు

నాట్లు ఆలస్యమైనప్పుడు నారు కొనలను తుంచి వేసుకోవాలి. ఎకరానికి మూడు లింగాకర్షక బుట్టలు పెట్టి ప్రతివారం బుట్టలో పడే మగరెక్కల పురుగులను గమనించాలి. నష్ట పరిమితి స్థాయి దాటినప్పుడు మాత్రమే పురుగు మందులు పిచికారీ చేయాలి. దీనికి కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు లేదా 0.3 మి.లీ. క్లోరాంట్రినిల్ ప్రోల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పాడి పంట

సుడిదోమ(దోమపోటు)

ఈ పురుగు నారుమడి లేదా పిలకల దశలో అరుదుగా, పొట్టదశ, ఈనిక దశల్లో ఎక్కువగా ఆశిస్తుంది. నీటి పైభాగంలో మొక్కల మొదళ్ల దగ్గర దోమలు కనబడతాయి. పిల్ల, పెద్ద పురుగులు రసాన్ని పీల్చడం వల్ల పైరు సుడులుగా ఎండిపోతుంది. ఉధృతి ఎక్కువగా ఉంటే పొలం ఎండిపోయి పడిపోవడం జరుగుతుంది.

అగ్గితెగులు

తొలిదశలో ఆకులపైన నూలు కండె ఆకారంలో మచ్చలు ఏర్పడి క్రమేణా అనుకూల వాతావరణ పరిస్థితుల్లో ఇవి విస్తరించి మచ్చలు, చివర్లు మొనదేలి ఉంటాయి. ఈ మచ్చల అంచులు ముదురు గోధుమ లేదా నలుపు రంగులో ఉండి ఆకులు కాలిపోయినట్లుగా వ్యాపిస్తుంది. సిఫారసు మేరకు కాకుండా నత్రజని ఎరువుల అధిక మోతాదుల్లో వాడడం, గాలిలో తేమ అధికంగా ఉండడం, మబ్బుతో కూడిన వాతావరణం, సన్నని వర్షపు జల్లులు ఈ తెగులు వ్యాప్తికి అనుకూలం.

నివారణ చర్యలు

విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలి. పైరుపై తెగులు లక్షణాలు కనిపిస్తే పొలంలో నీటిని తీసివేయాలి. బాగా ఆరనివ్వాలి. దీని వల్ల శిలీంద్రం తాలూకు సిద్ధ బీజాలు నశిస్తాయి. ట్రైసైక్లేజోల్ 1.5గ్రాములు లేదా కాసుగామైసిన్ 2.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ఉల్లికోడు, గొట్టపు రోగం

ఇది నారుమడి, పిలక దశల్లో ఆశిస్తుంది. అంకురం ఉల్లి కాడవలె పొడగాటి గొట్టంలా మారి బయటకు వస్తుంది. కంకి వేయదు. దుబ్బుల్లో కొన్ని పిలకలు ఉల్లికాడవలె పొడగాటి గొట్టాలుగా మారతాయి. సెప్టెంబరులో 200 మి.మీ. కంటే ఎక్కువ వర్షం పడితే వ్యాపిస్తుంది.

నివారణ చర్యలు

దీనిని తట్టుకునే రకాలను సాగు చేసుకోవాలి. ఆలస్యంగా నాట్లు వేసినప్పుడు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను 10కిలోలు లేదా ఫోరెట్ 10జి గుళికలను 5 కిలోలు ఎకరానికి నారు నాటిన 10నుంచి 15 రోజులకు వేసుకోవాలి.

నివారణ చర్యలు

దోమను తట్టుకొనే రకాలను సాగు చేసుకోవాలి. నత్రజని అధిక మోతాదు తగ్గించుకోవాలి. కాలిబాటలు తీయాలి. ఎసిఫేట్ 1.5 గ్రా, లేదా ఎథోఫెన్‌ప్రాక్స్ 2.0 మి.లీ, లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి..

పాముపొడ తెగులు

దుబ్బు చేసు దశ నుంచి కాండం, మట్ట, ఆకులపై మచ్చలు పెద్దవై పాము పొడ మచ్చలుగా ఏర్పడతాయి. మొక్కలు, పైరు పూర్తిగా ఎండిపోతుంది. తెగులు వెన్ను వరకు వ్యాపిస్తే తాలుగింజలు ఏర్పడతాయి.

నివారణ చర్యలు

విత్తన శుద్ధి చేయాలి. సిఫారసు మేరకు నత్రజని ఉపయోగించాలి. గట్లపై, చేనులో కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలి. హెక్సాకొనాజోల్ 2. మి.లీ. లేదా ప్రొపికొనాజోల్ 1మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.